క్లుప్తంగా

యూనివర్సిటీలకు నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

కర్నూలు(సెంట్రల్): రాష్ట్రంలోని యూనివర్సిటీల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వెనకబడిన కర్నూలు జిల్లాలోని రాయలసీమ, ఉర్దూ, క్లస్టర్ యూనివర్సిటీలకు ప్రత్యేక గ్రాంట్‌ను ప్రకటించాలన్నారు. ఉర్దూ, క్లస్టర్ యూనివర్సిటీలకు సొంత భవనాలు నిర్మించాలని, రాయలసీమ యూనివర్సిటీని అభివృద్ధి పథంలోకి తెచ్చేందుకు కృషిచేయాలని కోరారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా పాల్గొన్నారు.

రవాణా శాఖను ప్రైవేటుపరం చేయొద్దు

కర్నూలు(సెంట్రల్): రవాణా శాఖ కార్యాలయాల సేవలను ప్రైవేట్‌కు అప్పగించరాదని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ నగర అధ్యక్ష, కార్యదర్శులు జె.రవికుమార్, పి.మహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయరాదన్నారు. సెన్సార్ ఫిట్‌నెస్ ట్రాకులను కూడా రద్దు చేయకపోతే ఉద్యమాలకు దిగుతామని స్పష్టం చేశారు.

మాలధారణతో ప్రశాంతత



పూజల్లో శివదీక్షా స్వాములు



పూజలందుకుంటున్న శివలింగం

కర్నూలు కల్చరల్: మాలధారణ దీక్ష స్వీకరించి భగవంతుడిని ధ్యానిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి పేర్కొన్నారు. ఓల్డ్‌సిటీలోని శ్రీశైల దేవస్థానం సత్రంలో నిర్వహిస్తున్న శివపూజ, శివ భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. శివ భక్తులకు నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక సేవా గుణాన్ని కలిగి ఉండాలన్నారు. అంతకుముందు మహాశివుడికి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదాన కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

దోమలను నివారించాలి

కర్నూలు(హాస్పిటల్): దోమలను నివారించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. స్థానిక బుధవారపేటలో ఫ్రైడే – డ్రైడే కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్య సిబ్బంది వారి పరిధిలోని వార్డులను సందర్శించి దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఇళ్లలో వారానికోసారి నీటి నిల్వలను పూర్తిగా తొలగించి స్వచ్ఛమైన నీటిని పట్టుకునేలా కృషి చేయాలన్నారు. గృహ పరిసరాల్లో పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, పాతడబ్బాలు, ఉపయోగించని రోల్లు వంటివి లేకుండా అవగాహన కల్పించాలని, ఈ వివరాలను ఫ్రైడే – డ్రైడే యాప్‌లో క్రమం తప్పకుండా అప్‌లోడ్ చేయాలన్నారు. నీటి నిల్వలు గల ప్రాంతాలను గుర్తిస్తే ఆ సమాచారాన్ని వెక్టార్ కంట్రోల్ హైజిన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి సంబంధిత వార్డు సచివాలయ సెక్రటరీ ద్వారా సమస్య పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. డీఎంఓ నూకరాజు, బయాలజిస్టు వెంకటేశ్వర్లు, యుపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మాధవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీఈడీ రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షల రీ వాల్యుయేషన్ ఫలితాలను శుక్రవారం విడుదల చేశారు. వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఫలితాలు https://rayalaseemauniversity.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. 697 మంది రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోగా 306 మంది ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు.

కళాకారులకు రూ.6 వేలు పెన్షన్ ఇవ్వాలి

కర్నూలు(సెంట్రల్): కళాకారులకు కనీసం రూ.6 వేల పెన్షన్ ఇవ్వాలని, సమగ్ర సాంస్కృతిక విధానాన్ని అమలు చేయాలని ఏపీ ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు చంద్రనాయక్, పెంచలయ్య, సినీ డైరెక్టర్ బాబ్జీ డిమాండ్ చేశారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సాంస్కృతిక రంగాన్ని బతికించేందుకు ప్రజా నాట్యమండలి కృషి చేస్తుందన్నారు. ఎన్నికల్లో కళాకారుల ఓట్ల కోసం రాజకీయ పార్టీల నేతలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించడం తగదన్నారు. సమావేశంలో నాయకులు రామారావు, నాగరాజు, శివయ్య పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్‌లో ఒకే ఒక్కడు!



ఎస్వీ కాంప్లెక్స్ ఎదురుగా పార్కింగ్, సెట్‌బ్యాక్స్ లేకుండా నిర్మిస్తున్న వాణిజ్య సముదాయం

- నగరపాలకలో గాడి తప్పిన పాలన
- భవనాల నిర్మాణాలపై పర్యవేక్షణ నిల్
- డీసీపీ, ఏసీపీ, టీపీఎస్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ల కొరత
- ఆదాయం రాక.. అవినీతి పెరిగి..
- ఫైళ్ల క్లియరెన్స్ పెండింగ్
- పెండింగ్‌లో బీపీఎస్ దరఖాస్తులు



కర్నూలు (టౌన్) : నగరంలోని ఎస్వీ కాంప్లెక్స్ ఎదురుగా అమరావతి టిఫిన్ సెంటర్ స్థలంలో నూతనంగా జీ ప్లస్ 2 వాణిజ్య సముదాయం నిర్మిస్తున్నారు. పైన అదనంగా నిర్మాణాలు చేపట్టారు. పార్కింగ్ స్థలం లేదు. సెట్‌బ్యాక్స్ లేవు. వాణిజ్య సముదాయాల్లో ఈ రెండు తప్పనిసరి. టౌన్ ప్లానింగ్ అధికారులు ఈ ప్రధాన రోడ్డులో నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మరి ఈ అక్రమాలు ఎందుకు కనిపించడం లేదో?

● కుడా (కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) చైర్మన్ ఇంటి సమీపంలోనే పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఇంటి సమీపంలో పార్కింగ్ లేకుండా వాణిజ్య సముదాయం నిర్మిస్తున్నారు. అదే దారిలోనే ప్రకాష్ నగర్‌లో పార్కింగ్ లేకుండానే నాలుగు అంతస్తుల భవనం నిర్మిస్తున్నారు. ఇలా విచ్చల విడిగా అక్రమ నిర్మాణాలకు కారణం సిబ్బంది కొరతేనన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

● నగరపాలక సంస్థలో టౌన్ ప్లానింగ్ విభాగం కీలకం. భవన నిర్మాణాల అనుమతులు, వాణిజ్య సముదాయాలు, వెంచర్లు, అపార్టుమెంట్ల నిర్మాణాల అనుమతులు, వాణిజ్య ప్రకటనలు ఇలా ఎన్నో కీలకమైన పనులు చేయాల్సి ఉంటుంది. ఇటువంటి కీలకమైన ఈ విభాగంపై ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. 6.50 లక్షల జనాభా కలిగిన కర్నూలు నగరంలో 52 వార్డులు 1.49 లక్షల ఇళ్లు ఉన్నాయి. నిత్యం కార్యాలయానికి భవన అనుమతుల కోసం, వివిధ పనుల కోసం ప్రజలు వస్తుంటారు. అయితే సిబ్బంది లేకపోవడంతో పాలన గాడి తప్పిందన్న విమర్శలు ఉన్నాయి.

భారమంతా సిటీ ప్లానర్‌పైనే..

నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగంలో వాస్తవానికి ఒక సిటీ ప్లానర్, ఒక డిప్యూటీ సిటీ ప్లానర్, ఇద్దరు అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, ఐదుగురు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, ఇద్దరు టౌన్ సర్వేయర్లు, ఐదుగురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, ఒక ట్రేసర్, ఆరుగురు చైన్‌మెన్లు పనిచేయాల్సి ఉంది. అయితే కీలకమైన అనేక పోస్టుల్లో అధికారులు లేకపోవడం, ఉండాల్సిన సిబ్బంది కన్నా తక్కువగా ఉండటంతో పాలనపరమైన ఇబ్బందులు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి 8 నెలలు అవుతున్నా ఇప్పటికీ డిప్యూటీ సిటీ ప్లానర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ పోస్టులు భర్తీ చేయలేదు. అలాగే ఐదుగురు బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లకు గాను ఒక్కరే పర్యవేక్షణ చేయాల్సి ఉంది. టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు సైతం ఇరువురు మాత్రమే ఉన్నారు. ఇరువురు టౌన్ సర్వేయర్లలో ఒకరే పనిచేస్తున్నారు. ఆయన కూడా ఓడీ (అదనపు బాధ్యతలు) కింద పనిచేస్తున్నారు. కర్నూలు నగర పరిధిలో ఇళ్ల స్థలాలు, నిర్మాణాలకు సంబంధించిన వివాదాలు, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులు, కలెక్టరేట్‌తో పాటు వచ్చే ఫిర్యాదులన్నింటినీ టౌన్ సర్వేయర్ పరిష్కరించాల్సి ఉంది. రెండు పోస్టుల్లో ఒకరే పనిచేస్తున్నారు. దీంతో సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయి. ఇక 3.50 లక్షల జనాభా ఉన్న కర్నూలు కార్పొరేషన్‌లో చైన్‌మెన్లు 6 మంది ఉన్నారు. ఇప్పుడు జనాభా పెరిగింది. వార్డులు పెరిగాయి. నిర్మాణాలు పెరిగాయి. మునగాలపాడు, మామిదాలపాడు, స్టాంటన్‌పురం, పందిపాడు, పెద్దపాడు, లక్ష్మీపురం గ్రామాలను కర్నూలు కార్పొరేషన్‌లో విలీనం చేశారు. తాజాగా 6.50 లక్షలకు జనాభా చేరుకుంది. అయినా చైన్‌మెన్ల సంఖ్య పెరగలేదు. అరకొర సిబ్బందితో టౌన్ ప్లానింగ్ విభాగం నెట్టుకొస్తోంది. ఇక అన్ని క్యాడర్లలో సిబ్బంది లేకపోవడంతో ప్రతి పని సిటీ ప్లానర్‌పై పడింది. ఒక్కరే ఉండటంతో ఇబ్బందులు వస్తున్నాయి. ఆఫీసు పనితో పాటు బయట వచ్చే ఫిర్యాదులను తనిఖీ చేయాల్సి ఉంటుంది. దీంతో పాలన ఇబ్బందికరంగా మారింది. అనేక పోస్టులు ఖాళీగా ఉండటంతోనే ఈ సమస్యలు వస్తున్నాయని, ఆ విభాగం సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవి కాక కోర్టు కేసులు, వాణిజ్య ప్రకటనల ఆదాయం వసూళ్లు ఇబ్బందికరంగా మారాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆదాయానికి గండి - అటకెక్కిన బీపీఎస్ క్లియరెన్స్

పట్టణ ప్రణాళిక విభాగంలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆదాయానికి గండి పడుతోంది. ఫ్లెక్సీలు, బ్యానర్లు, అడ్డగోలుగా వెలుస్తున్నాయి. ఆదాయం మాత్రం పెరగడం లేదు. ఆదాయం పక్కదారి పడుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఇక నగరంలో అనుమతులు లేకుండా నిర్మించుకున్న భవనాలకు బీపీఎస్ (భవనాల క్రమబద్ధీకరణ పథకం) కింద క్లియరెన్స్ నత్తనడకన సాగుతోంది. ఇప్పటివరకు ఈ పథకానికి 14,097 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 981 దరఖాస్తులు షార్ట్‌ఫాల్ పేరుతో పెండింగ్‌లో ఉన్నాయి. 217 దరఖాస్తులను అధికారులు తిరస్కరించారు. ఇప్పటివరకు ప్రభుత్వానికి రూ.6,36,64,195 ఆదాయం వచ్చింది. ఇప్పటికీ అనేక దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో పాటు అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు లేకపోవడం కూడా ఒక కారణమని చెప్పవచ్చు. కీలకమైన విభాగంలో కొరత, పర్యవేక్షణ లేకపోవడంతోనే ఈ సమస్యలు ఏర్పడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి.

పర్యవేక్షణ లేక.. అక్రమాలకు అడ్డాగా...

నగర పరిధిలో ఏదైన భవనం, వాణిజ్య సముదాయం, అపార్టుమెంటు నిర్మించాలంటే తప్పనిసరిగా నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు ప్లాన్ అనుమతి తీసుకొని నిర్మాణాలు చేపట్టాలి. అయితే నగరంలో పదుల సంఖ్యలో ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్నారు. అదనపు ఫ్లోర్లు యథేచ్ఛగా నిర్మిస్తున్నారు. ఇటువంటి నిర్మాణాలు నగరంలో ఇబ్బడిముబ్బడిగా ఉన్నాయి. వాణిజ్య నిర్మాణాల్లోనూ బేఖాతరు చేస్తున్నారు. అనేక నిర్మాణాల్లో నిబంధనలను పట్టించుకోవడం లేదు. ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారు. పార్కింగ్ లేకుండా, సెట్‌బ్యాక్స్ లేకుండా వాణిజ్య నిర్మాణాలు చేస్తున్నారు. సిబ్బంది లేకపోవడంతోనే ఈ సమస్య వస్తోంది. అరకొర సిబ్బంది ఉండటం వల్ల అవినీతి పెరిగింది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాల విషయంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇటీవల సంబంధిత 23 భవనాలకు నోటీసులు ఇచ్చారు. చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొన్నారు.అయితే నోటీసులు అందుకున్న పలువురు యజమానులు మామూళ్లు ముట్టజెప్పి అక్రమ నిర్మాణాలను కొనసాగిస్తున్నారు.

పార్టీ కోసం పనిచేసే వారికి గుర్తింపు



ఎస్వీ దంపతులను సత్కరిస్తున్న గోల్డ్ శ్రీనివాసులు, తదితరులు

కర్నూలు (టౌన్): పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలకు వైఎస్సార్‌సీపీలో ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి అన్నారు. ఇటీవల జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడిగా నియమితులైన గోల్డ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ శ్రేణులు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డిని కలిశారు. ఆయన నివాసంలో ఎస్వీ దంపతులను శాలువా కప్పి గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలకు పదవులు అప్పగించామన్నారు. పదవుల్లో ఉన్న వారంతా పార్టీ కోసం కష్టపడి పనిచేయాలన్నారు. భవిష్యత్తు వైఎస్సార్‌సీపీదే అన్నారు. చంద్రబాబు ఏదో చేస్తారని నమ్మి గెలిపిస్తే అన్ని వర్గాలను ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. గద్దెనెక్కి 8 నెలలు అవుతున్నా సూపర్ సిక్స్ హామీల గురించి ప్రభుత్వం మాట్లాడటం లేదన్నారు. ప్రజలు, మహిళలు, విద్యార్థులు, నిరుద్యోగులు ఇలా.. ప్రతిఒక్కరూ కూటమి ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. పార్టీ సీనియర్ నాయకులు, వివిధ విభాగాల అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నతంగా రాణించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): ప్రతి బాలిక ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాన్ని సాధించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్లాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ చెప్పారు. శుక్రవారం స్థానిక ఇందిరాగాంధీ మెమోరియల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 'జాతీయ బాలికా దినోత్సవం' సందర్భంగా 'బాలికా సాధికారత–ఉజ్వల భవిష్యత్' అనే నినాదంతో డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో ఆడపిల్లలను రక్షిద్దాం–ఆడపిల్లలను చదివిద్దాం, కిశోర బాలికల్లో పోషకాహార ప్రాముఖ్యత అనే అంశాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. లింగ నిష్పత్తిలో అసమతుల్యత వల్ల వచ్చే నష్టాల గురించి వివరించారు. ఆడపిల్లలు చదువుకోవడం వల్ల ఆర్థిక స్వావలంబన సాధించి ఉజ్వల భవిష్యత్ సాకారం అవుతుందన్నారు. డీఐఓ డాక్టర్ నాగప్రసాద్ మాట్లాడుతూ సమాజంలో స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, వారి మధ్య ఎలాంటి వివక్షా ఉండకూడదన్నారు. డెమో శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య విద్యా బోధకురాలు పద్మావతి, ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను బతకనిద్దాం

కర్నూలు(అర్బన్): పురుషాధిక్య సమాజంలో తల్లి గర్భంలో ఆడ శిశువు ఉందని తెలిస్తే గర్భాన్ని తొలగిస్తున్నారని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా.. శుక్రవారం స్థానిక జిల్లా కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లింగ నిర్ధారణ స్కానింగ్ సెంటర్లపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. సమాజంలో ఆడ పిల్లలు స్వేచ్ఛగా జీవించేందుకు ప్రతిఒక్కరూ చేయూత అందించాలన్నారు. ముఖ్యంగా ఆడపిల్లలకు ఉచిత వైద్యం, విద్యను ప్రభుత్వం అందించి వారి ఎదుగుదలకు కృషి చేయాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఆడ, మగ సమానమనే విధంగా జండర్ క్లాస్‌లను నిర్వహించాలన్నారు. చిన్నతనం నుంచే బాల బాలికలకు ఇద్దరు సమానమనే సందేశాన్ని కలిగించాలన్నారు. వేదిక జిల్లా అధ్యక్షురాలు పాలెం రాధ, తాటికొండ సుంకమ్మ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ హత్య దారుణం

కర్నూలు(అర్బన్): ఆలూరు మండలం అరికెర గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ బండారి ఈరన్నను హత్య చేయడం దారుణమని ఏపీ కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఉపాధి పనులు చేయించేందుకు వెళ్తున్న ఈరన్నపై వేటకొడవళ్లతో దాడి చేసి హతమార్చిన దుండగులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు. ఈ హత్యను సంఘం నేతలు ధనుంజయ, వెంకటేశ్వర్లు, శంకర్, ఉరుకుందు, కేసీ నాగన్న, తవుడు శ్రీనివాసులు, బీ రామక్రిష్ణ, పుల్లన్న, తిరుపాలు తదితరులు తీవ్రంగా ఖండించారు.

హంతకుడిని కఠినంగా శిక్షించాలి

కర్నూలు(సెంట్రల్): ఆలూరు మండలం అరికెర గ్రామ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ బండారి ఈరన్నను దారుణంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌గా ఉన్న ఈరన్నను తొలగించేందుకు టీడీపీ నాయకులు కుట్ర చేసినా ఆయన లొంగకపోవడంతో చివరికి అంతమొందించడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్లకు భద్రత కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆలూరు మండలం అరికెర గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్నను హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. రాజకీయాలకు ఫీల్డ్ అసిస్టెంట్లు బలవుతున్నారని, ప్రభుత్వాలు మారిన సమయాల్లో వారిని బలవంతంగా మార్చడం అన్యాయమన్నారు. ఈరన్నను బలవంతంగానైనా తొలగించాలని టీడీపీ నాయకులు చూశారని, అతడు వైదొలగకపోవడంతో హత్య చేశారని ఆరోపించారు. వెంటనే నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు (సిటీ): జలవనరుల శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లుగా పనిచేస్తున్న వారికి ఇటీవల పర్యవేక్షక ఇంజినీర్లుగా పదోన్నతులు లభించాయి. ఇందులో భాగంగా కర్నూలు సర్కిల్ ఎస్‌ఈగా ద్వారకానాథ్ రెడ్డిని నియమించారు. ఆయన శుక్రవారం ఎస్‌ఈగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పర్యవేక్షక ఇంజినీర్‌గా రెగ్యులర్ ఆఫీసర్ లేకపోవడంతో డిప్యూటీ ఎస్‌ఈగా పనిచేస్తున్న బాలచంద్రారెడ్డి ఇన్‌చార్జ్ ఎస్‌ఈగా పనిచేస్తున్నారు. తెలుగుగంగ కడప సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ పర్యవేక్షక ఇంజినీర్‌గా పనిచేస్తున్న ద్వారకానాథ్ రెడ్డిని రెగ్యులర్ ఎస్‌ఈగా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన్ను సర్కిల్ ఆఫీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం కర్నూలు ప్రాజెక్టు సీఈ కబీర్ బాషాను ద్వారకానాథ్ రెడ్డి కలిశారు.

నర్సింగ్ కాలేజీలో స్కిల్ ల్యాబ్

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో జనిత మోన్ స్కిల్ (సిమ్యులేషన్) ల్యాబ్ ఏర్పాటైంది. శుక్రవారం దీనిని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన జనిత స్కిల్ ల్యాబ్ విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రోడ్డు ప్రమాదాలు, ప్రసవాలకు వచ్చే రోగులకు వైద్యం ఎలా అందించాలి అనే దానిపై బొమ్మల ప్రోగ్రాం ద్వారా అవగాహన కల్పించేందుకు ఈ ల్యాబ్ ఉపయోగపడుతుందన్నారు. ప్రిన్సిపాల్ ఎస్.మంజులరాణి, వైస్ ప్రిన్సిపల్ వి.ధనలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ ఏమైంది బాబూ?

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య విమర్శించారు. శుక్రవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మెగా డీఎస్సీ విడుదల చేస్తామని మొదటి సంతకం చేశారన్నారు. అనంతరం 7 నెలలు గడిచిపోయినా ఇంతవరకు డీఎస్సీ ఊసే లేకపోవడంతో ఎంతో మంది నిరుద్యోగులు ఆశగా ఎదురు చూస్తున్నారన్నారు. వేలాది రూపాలయు ఖర్చు పెట్టి కోచింగ్‌లు తీసుకొని చదువుతున్నా నోటిఫికేషన్ రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు చెప్పారు. చెప్పిన మాట ప్రకారం ఉద్యోగాలు ఇవ్వలేని పక్షంలో నిరుద్యోగ భృతి నెలకు రూ.3 వేలైనా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే తల్లికి వందనం పేరిట ప్రతి విద్యార్థికి రూ.15 వేలు ఇస్తామని చెప్పారని, ఆ ఊసే లేకపోవడంతో మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తల్లికి వందనం ఇవ్వకపోయిన తండ్రికి ఇంధనాన్ని మాత్రం చంద్రబాబు ప్రభుత్వం ఇచ్చిందని, ఏ గ్రామంలో చూసినా బెల్టు షాపులు కళకళలాడుతున్నాయని విమర్శించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు మునెప్ప, కారుమంచి తదితరులు పాల్గొన్నారు.

బాలసుందరానికి నివాళి

కర్నూలు (అర్బన్): జిల్లాలో పేద దళిత వర్గాలకు డాక్టర్ మాధవరం బాలసుందరం మృతి తీరని లోటని పలువురు వక్తలు కొనియాడారు. ఈనెల 14న మృతిచెందిన మాధవరం బాలసుందరం సంస్మరణ సభ శుక్రవారం రాత్రి ఇంపీరియల్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి మారెప్ప, మాజీ ఎమ్మెల్యేలు వై.ఐజయ్య, టి.ఆర్థర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలసుందరం దళితుల హక్కుల కోసం ఎన్నో సమస్యలకు ఎదురొడ్డారన్నారు. న్యాయం కోసం ఎన్నో పోరాటాలు చేసి అంబేడ్కర్ ఆశయ సాధనకు ఎంతో కృషి చేసిన గొప్ప నాయకుడన్నారు.

క్యాలెండర్ విడుదల



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): ఆంధ్రప్రదేశ్ రోడ్లు, భవనాల శాఖ ఉద్యోగుల సంఘం క్యాలెండర్‌ను ఏపీఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్‌లాల్ విడుదల చేశారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఆర్‌వీ రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ప్రధాన కార్యదర్శి జవహర్‌లాల్, ఎన్‌జీఓ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సాంబశివారెడ్డి హాజరై క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. ఎన్‌జీఓ అసోసియేషన్ నేతలు భాస్కరనాయుడు, లక్ష్మీనాయణ, ఆర్‌అండ్‌బీ ఉద్యోగుల సంఘం నేతలు వీరస్వామి, నవీన్, రాజేష్‌కన్నా తదితరులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న ఈడీ తులసీదేవి

కేవీపీఎస్ డైరీ ఆవిష్కరణ

కర్నూలు(అర్బన్): కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కమిటీ రూపొందించిన నూతన సంవత్సర డైరీని శుక్రవారం నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కే తులసీదేవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం కేవీపీఎస్ రాష్ట్ర స్థాయిలో డైరీ, జిల్లా స్థాయిలో క్యాలెండర్లను ముద్రిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది కేవీపీఎస్ కర్నూలు జిల్లా కమిటీగా ఏప్రిల్ నుంచి తిరిగి 2026 మార్చి 31 దాకా ఉండేలా సామాజిక ఉద్యమ క్యాలెండర్‌ను తీస్తున్నామన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు ఎన్‌జీ కృష్ణ, నాయకులు చక్రపాణి, లక్ష్మీనారాయణ, ఆర్ రమణ, యేసురాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల నగర కమిటీ ఎన్నిక

కర్నూలు(సెంట్రల్): ఏపీ ఆటోడ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నూతన నగర కమిటీని శుక్రవారం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప ప్రకటించారు. గురువారంలోని అంబేడ్కర్ భవన్‌లో ఆ సంఘం నగర కమిటీ 9వ మహాసభలు జరిగాయి. ఆ సభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా రాము, కృష్ణారెడ్డిలను ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా బి.వెంకటేష్, ఉప ప్రధాన కార్యదర్శిగా నాగరాజును నియమించినట్లు చెప్పారు.

ఓటు హక్కుతోనే ప్రజాస్వామ్యం బలోపేతం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ



ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు


కర్నూలు(హాస్పిటల్): ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యం బలోపేతం అవుతుందని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అన్నారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీలో 'జాతీయ ఓటరు దినోత్సవం' పురస్కరించుకుని ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఓటు పౌరుల ప్రాథమిక బాధ్యతగా గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అరుణ, డాక్టర్లు నాగార్జున, సోమశేఖర్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటరే

కర్నూలు (టౌన్): దేశ భవిష్యత్తును నిర్ణయించేది ఓటరే అని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. ఈనెల 25వ తేదీన ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం నగరపాలకలోని ఆయన చాంబర్‌లో ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ మాట్లాడుతూ.. ఓటరే ప్రజాస్వామ్య శక్తి అన్నారు. ఓటుహక్కు ప్రాముఖ్యతను వివరించారు. తహసీల్దారు వెంకటలక్ష్మి, అదనపు కమిషనర్ కృష్ణ, మేనేజర్ చిన్నరాముడు, డీటీ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

కర్పూరీ ఠాకూర్‌కు ఘన నివాళి

కర్నూలు(అర్బన్): బీసీల అభివృద్ధికి కర్పూరీ ఠాకూర్ ఎనలేని సేవలందించారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం భారతరత్న, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్ జయంతి సందర్భంగా స్థానిక బీసీ భవన్‌లో సంఘం రాష్ట్ర కార్యదర్శి మద్దూరి రాంబాబు అధ్యక్షతన బీసీ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నక్కలమిట్ట శ్రీనివాసులు మాట్లాడుతూ.. కర్పూరీ ఠాకూర్ అభినవ అంబేడ్కర్‌గా పేరుగాంచి, బీహార్ ముఖ్యమంత్రిగా రెండు పర్యాయాలు పనిచేసి బీసీలకు ఆరాధ్యులయ్యారన్నారు. మండల్ కమిషన్ రిపోర్టుకు కూడా మార్గదర్శకులయ్యారని, ఆయన సేవలను గుర్తించిన మోదీ ప్రభుత్వం భారత రత్నను ప్రకటించిందన్నారు. బహుజన విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు జేవీ క్రిష్ణయ్య, నాయకులు బీ.నాగభూషణం, ఆనంద్‌బాబు, ఉప్పరి శివన్న తదితరులు పాల్గొన్నారు.



కర్పూరీ ఠాకూర్ చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న బీసీ నేతలు

భారతరత్న ఇవ్వడంపై హర్షం

కర్నూలు(అర్బన్): బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇవ్వడం పట్ల నాయి బ్రాహ్మణ సేవా సత్సంగం నేతలు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కర్పూరీ ఠాకూర్ జయంతి సందర్భంగా స్థానిక షరీన్‌నగర్‌లోని సద్గురు త్యాగరాజ సీతా రామాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళుర్పించారు. నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరయ్య, మల్లికార్జున, ఎక్స్ ఆఫీషియో ప్రెసిడెంట్ స్వామి చంద్రుడు తదితరులు మాట్లాడుతూ కర్పూరీ ఠాకూర్ సేవలను కొనియాడారు.